# జీవితం చేజారనీకు

- కొండా కుసుమకుమారి

గులాబీ రేకు మీద నిలిచిన మంచు ముత్యంలో అద్భుతమైన అందం ఉంది. గడ్డి పువ్వులో కనిపించని సొగసు ఉంది. గరిక పోచలో సైతం స్నిగ్ధత్వం మూర్తీభవించింది. ఈ ప్రపంచంలో అణు వణువునా సౌందర్యం ఇమిడి ఉంది. సౌందర్యాన్ని చూడ గలిగిన హృదయంలోనే ప్రేమ, దయ, మానవత్వం నిక్షిప్తమై ఉన్నాయి; ప్రేమించే హృదయంలోనే భగవంతు డున్నాడు.

* * * * * *

బద్ధకంగా కళ్ళు విప్పిన విశ్వానికి గదిలో వస్తువులన్ని అలుక్కు పోయినట్లు కనిపించాయి. క్రమంగా వాటిని పోల్చుకొనే లోపు లోపల నుండి కేకలు వినిపించాయి. అది తల్లి గొంతు అని గ్రహించిన వెంటనే లేచి గబగబ లోపలకు నడిచాడు.

"కాఫీ ఇలా తగలడిం దేమిటే అంటే నన్నే చేసుకో మంటావా? ఇక అన్ని పనులు నేనే చేసుకొనేటట్లయితే ఇక నువ్వెందుకట. నా నెత్తినెక్కి నాట్యం చెయ్యడానికా? కొంపలో చిన్నంతరం, పెద్దంతరం లేకుండా పోయింది. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాల చచ్చినట్లు చివరకు నీతో కూడా మాటలు పడవలసి వచ్చింది."

"ఏమిటమ్మా! ఏమైంది?" విశ్వం అడిగాడు.

"ఇంకా ఏం కావాల్లే నా పెద్దరికం మంట గలిసిపోయాక. ఇన్నేళ్ళొచ్చి ఎవరితోనూ ఒక్క మాట పడకపోయినా ఇవాళ నీ పెళ్ళాంతో అనిపించు కోవలసి వచ్చింది. ఇక తనకు తోడు నువ్వూ నాలుగు మాట లను నరిపోతుంది." కొంగుతో కళ్ళు ఒత్తుకుంది కాంతమ్మ.

విశ్వం మనసు విలవిల లాడింది. తల్లి ఎంత దర్పంగా బ్రతికిందో తనకి తెలుసు. తననెంత అపు రూపంగా చూసుకుందో కూడా మరచిపోలేదు.

కూరగాయలు తరుగుతూ నిర్లిప్తంగా ఉన్న భార్య వైపు కోపంగా చూశాడు.

ఆ ప్రక్కనే ఒలికిన కాఫీ, క్రింద దొర్లుతున్న గ్లాసు కనిపించాయి.

"మాట్లాడ వేం? ఏం జరిగింది?"

తలెత్తి భర్త వైపు చూడకుండానే, "కాఫీ బాగోలేదట. అందుకని ఆమెకు నచ్చేవిధం చేసుకో మన్నాను. దాని కోసం ఈ గొడవంత" అంది అవని.

"అంటే నీకు కాఫీ కూడా చేతకాదన్న మాట." కోపంగా అన్నాడు.

"ఆమెకు నచ్చే విధంగా మాత్రం ఎప్పటికీ రాదేమో."

"చూశావా? ఎంత పొగరుగా జవాబు చెబుతుందో? ఇక అత్తముండను నే నొక లెక్కా! పక్కింటి వగలాడి స్నేహం బాగానే వంట బట్టింది. అందుకే ఇది ఇలా తెగించి మాట్లాడుతోంది. ఇక నేను కూడా ఎక్కడికైనా పోయి ఏ దిక్కుమాలిన దాని లాగానో బతకాల్సి వచ్చేటట్టుంది. ఎందుకొచ్చిన తాపత్రయం? నా దారిన నేను పోతాలే నాయనా." రాగాలాపన.

విశ్వం తీవ్రంగా చూస్తూ అవని రెక్క పుచ్చుకొని విసురుగా పైకి లేపాడు. "ఏం చూసుకొని నీ కీ పొగరు!

"సమాధానం చెప్పడమే నేరమైతే ఇక నేను చెప్పేదేం లేదు."

"నోర్మూయ్! నీ కీ మధ్య ఒళ్ళు తెలియకుండా ఉంది. నిన్నూ..." ఆమె చెంపలు ఎడా పెడా వాయించాడు. ఇంకా ఏదైనా మాట్లాడితే చూసి డోసు పెంచుదా మన్నట్లు రౌద్రాకారంతో నిలబడ్డాడు.

అవని అరచి గోల పెట్టలేదు. ఏడ్చి రాద్ధాంతం చెయ్య లేదు. అలాగని అలకపాన్పూ ఎక్కలేదు.

"ఇంత కంటె ఇంకేం చేయగలవు?' అన్నట్లు నిరసన కూడిన చూపు భర్త వైపు విసిరి కూరల గిన్నె తీసుకొని వంటింట్లోకి వెళ్ళింది.

విశ్వం ఎగరొప్పుతో కొంచెం సేపలాగే చూసి తల్లికూడా ఏమీ మాట్లాడ లేకపోవడంతో పెరట్లోకి నడిచాడు పేస్టూ, బ్రష్షూ తీసుకొని.

కిలకిల మన్న నవ్వులు పువ్వులై తన వైపు విసిరినట్లని పించడంతో తల తిప్పి పక్కింటి వైపు చూశాడు.

పూలమొక్కల మధ్య కురు లార బెట్టుకుంటూ తిరుగుతోంది లాస్య.

ఆమె అందాన్ని ఫోటోలో బంధించాలని కాబోలు కెమెరా పుచ్చుకొని రకరకాల భంగిమల కోసం పాట్లు పడుతున్నాడు మన్మోహన్. వాళ్ళిద్దరి మధ్య కేరింతలు కొడుతూ, చప్పట్లు కొడుతూ ఆడు కుంటున్నాడు వాళ్ళ మూడేళ్ళ కొడుకు దీపక్.



'హు! నిరసనగా చూశాడు విశ్వం. 'కష్టపడి పెంచి ఇంతవాడిని చేసిన కన్న తండ్రిని చూడకపోయినా భార్య కొంగు పుచ్చుకొని వాజమ్మ లా తిరగ్గలడు ఛీ!' చీదరింపుగా అనుకున్నాడు.

ఇరుగు పొరుగు వాళ్ళవడం వలన ఇద్దరి మధ్య స్నేహం ఉండేది ఇది వరకు. కాని మన్మోహన్ వివాహ మయ్యాక భార్యమాట విని తండ్రిని దూరం చేసుకోవడంతో అతడి పట్ల ఉన్న అభిమానం విశ్వం మనసులో తుడిచి పెట్టుకు పోయింది. తండ్రి సంపాదించిన ఆస్తి-పాస్తులు అనుభవిస్తూ ఆయన అనారోగ్య కారణంగా ఎక్కడో నర్సింగ్ హోంలో చేర్పించి చేతులు దులుపుకోవడం చూస్తుంటే అతడి మీద అసహ్యం కలిగింది. మన్మోహన్ మాములుగానే వుంటున్నా అతడితో పూర్వంలా ఆత్మీయతతో ఉండ లేకపోతున్నాడు.

విశ్వాన్ని చూస్తునే మన్మోహన్ పలకరింపుగా నవ్వాడు.

మొహమాటపు నవ్వుతో తల పక్కకు తిప్పుకున్నాడు విశ్వం.

ఆఫీసు నుండి బయట పడ్డాక కోలీగ్స్‌తో సెంటరు వరకు వచ్చి అటు నుండి పార్కులోకి నడిచాడు. రోజూ పొద్దుపోయే వరకు మిత్రులతోనో లేదా పార్కులోనో గడపడం అతడి అలవాటు.

ఫౌంటెన్ సమీపంలో కూర్చొని నీటి ధారల చల్లదనాన్ని పీల్చుకొన్నాడు. ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ, ఉల్లాసంగా తిరుగుతున్న జంటల్ని చూస్తూ గడిపాడు కొంత సేపు. పార్కులో జనం పలుచబడే వేళకు లేచి ఇంటికి బయలు దేరాడు.

నాలుగడుగులు వేసే సరికి "అంకుల్!" అంటూ పరుగున వచ్చి కాళ్ళను చుట్టేసాడు దీపక్.

"అరె నువ్వా దీప్!" అంటూ ఎత్తు కొన్నాడు.

"మమ్మీ, డాడీ ఇక్కడున్నారు" అంటూ ఆ ప్రక్కనే వున్న బోగన్‌విలియా పొద దగ్గరకు తీసుకెళ్ళాడు.

విశ్వాన్ని చూస్తూనే మన్మోహన్ సంతోషంతో పలకరించి, "నీ అల్లుడు అసాధ్యుడు. ఇప్పటి నుండే మామ గారిని కాకా పట్టేస్తున్నాడు. వాడిని నిరాశ పరచకుండా తొందరలోనే ఓ అమ్మాయిని ఇవ్వాలి సుమా!" అన్నాడు నవ్వుతూ.

బలవంతపు నవ్వు తెచ్చుకొన్నాడు విశ్వం.

"కూర్చోండి." ఆహ్వానించింది లాస్య. "అవ గారిని కూడా తీసుకు రావలసింది."

"తనకంత తీరిక వుండదు" ముక్తసరిగా అన్నాడు.

"ఇంట్లో ఉన్న ముగ్గురిలో ఇద్దరు ఆడవాళ్ళే అయినప్పుడు అంత పనేం ఉంటుంది! ఇప్పుడే కదా సరదాగా తిరిగేది. పిల్లలు పుట్టాక ఇక వాళ్ళతోనే సరిపోతుంది."

తల్లి అప్పుడప్పుడు లాస్య గురించి, ఆమె కబుర్ల గురించి చెప్పడం గుర్తొచ్చి విశ్వం ముఖంలో మార్పు వచ్చింది. మా సరదా కోసం ఈ వయసులో అమ్మను కష్ట పెట్టడం నా కిష్టముండదు" అన్నాడు సూటిగా.

లాస్య అదోలా చూస్తూ, "అవని సుఖ పడటం కూడా మీ కిష్టం ఉండదు కాబోలు" అంది

చురుగ్గా చూశాడు. "మీరు అనవసరమైన ప్రసంగం తీసుకొస్తున్నారు."

దీపక్‌తో ఆడుకుంటున్న మన్మోహన్ అతడి వైపు చూస్తూ- "విశ్వం! మన మధ్య ఉన్న స్నేహాన్ని, పురస్కరించుకొని లాస్య చనువు తీసు కొంటోంది. నువ్వు కోపం తెచ్చుకోకు. పొద్దుట మీ ఇంట్లో జరిగిన గొడవ చూశాక సాటి ఆడదానిగా అవని గురించి బాధ పడుతుంది. నీ తల్లి మీద నీ కున్న అభిమానం నాకు తెలుసు. కానీ జీవితాంతం నీతో కలసి బ్రతకడానికి నీ ఇంటికొచ్చిన ఇల్లాలి మీద నీ కెంత అభిమాన ముందో ఆమెకు ఎటువంటి ఆదరణ ఇవ్వగలుగు తున్నావో ఒక్క క్షణం ఆలోచించు."

విశ్వం ముఖం కంద గడ్డలా మారింది. "కట్టుకొన్న భార్య కోసం కన్న వాళ్ళను దూరం చేసుకొనే టంత మూర్ఖుడ్ని కాను నేను" అన్నాడు తీవ్రంగా.

దెబ్బతిన్నట్లు చూసాడు మన్మోహన్. అతని ముఖం వెలవెలపోయింది. లాస్య కూడా చిన్న బోయిన వదనంతో మౌనంగా వుండి పోయింది.

కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత నెమ్మదిగా అన్నాడు- "నాన్న మీద నీ కున్న అభిమానానికి థాంక్స్! ఇవాళ ఆయన గురించి నీకు కొంత చెప్పాలని పిస్తుంది. నాన్న పది మందిలో పెద్ద మనిషిగా పేరు తెచ్చు కోవడం అందరికీ తెలుసు. కాని ఇంట్లో అమ్మ నెప్పుడూ పెద్ద మనసుతో చూడలేక పోయాడు. భర్త అనే అధికార హోదాలో, మగవాడి ననే అహంకారంతో మాత్రమే ప్రవర్తించాడు. ఒక బానిసగా తప్ప సహ ధర్మచారణిగా ఎప్పుడూ గుర్తించ లేదు. నాకు ఊహ తెలిసినప్పటి నుండి అమ్మ సుఖపడటం నేను ఎరుగ ను. అపు రూపమైన దాంపత్య జీవితంలో విలువైన క్షణాలన్ని కాలి బూడిదవగా అమ్మ జీవచ్ఛంలాగే బ్రతికింది. కేవలం నా కోసమే జీవించింది. అధికార పీఠమెక్కి ఆ హోదాలోనే ఆనందం పొంద గలిగిన నాన్నలో అమ్మపోయాక అనుకోని మార్పు కనిపించింది. శారీరకంగా కృంగిపోయాడు. మానసికంగా కూడా దిగ జారిపోయాడు. ఎవరితో మాట్లాడేవాడు కాదు. ఎప్పుడూ పరధ్యానంగా ఉండి పోయేవాడు. ఎంతో ఉత్సాహంతో బిజినెస్ వ్యవహారాలు చూసుకొనే ఆయన ఒక్కసారిగా ఈ లోకంతో సంబంధం లేని వ్యక్తిలా అయిపోయాడు.

"డాక్టర్లకు చూపించి ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కనిపించ లేదు. చివరకు సైకియాట్రిస్టుకు చూపించగా అది మానసిక వ్యాధిగా గుర్తించడం జరిగింది. ఆయన కొన్నాళ్ళు ఇక్కడి వాతావరణానికి దూరంగా ఉంటే మంచిదని హైదరాబాద్‌లో తనకు తెలిసిన మరో డాక్టరును ఈ కేసును తీసుకో వలసిందిగా కోరారు.

"నాన్నను వెంటనే అక్కడ హాస్పిటల్లో జాయిన్ చేశాం. సకల సపర్యలు చేస్తూ ఆయనను నీడలా అంటి పెట్టుకొన్న అమ్మ ఆయన జీవితం నుండి నిష్క్రమించాక గాని ఆమె విలువ తెలిసి రాలేదు నాన్నకు. ఆమె లేని జీవితం ఎంత వెలితిగా, శూన్యంగా ఉందో తెలిశాక, తను చేసిన అన్యాయానికి పరి తపిస్తూ, చే జారిన జీవితం గురించి వ్యథా భరితు డవుతూ తనలో తాను ఆవేదన చెందుతూ మానసికంగా క్షీణించి పోవడం జరిగిందని డాక్టరు అన్నారు. సరయైన స్థితిలో ఆయన మానసిక అనారోగ్యాన్ని గుర్తించడం వలన మేలు జరిగిందని, ఆలస్యమైతే ఆయన ఉన్మాద స్థితిలోకి జారిపోయి ఏ విధంగా ప్రవర్తించే వాడో చెప్పడం కష్టమని అన్నారు. ఇప్పుడు నాన్న మామూలు స్థితికి రాగలిగాడు. ప్రేమించడం, ప్రేమను పంచుకోవడం తెలియని నాన్న ఇప్పుడు వృద్ధ రోగుల సేవాసదన్‌లో వృద్ధులకు సేవ చేస్తూ, ప్రేమను పంచుతూ జీవితం ఏమిటో తెలుసుకొని సంతోషంతో బ్రతుకు తున్నారు.

"ఇప్పు డిక్కడకు వచ్చేందు కూడా ఆయనకు ఇష్టం లేదు. చూడాలను కొన్నప్పుడు మేము వెళ్ళి వస్తుంటాం. విశ్వం! ఒక్క మాట. జీవితంలో అమూల్యమైన క్షణాలు చేజార్చు కొని వగచే కంటే వాటి విలువను తెలుసు కొని జీవించడం గొప్ప కళ. మీ అమ్మకు నీ మీద ఉన్న కొండంత మమకారంలో సగమైనా నీ బ్రతుకును పండించి నీ జీవితాన్ని పంచుకొనే భార్య మీద లేకపోతే అది స్వార్థ పూరితమైన ప్రేమ అనుకోవాలి. లేదా నీ మీద తనకున్న ఆధిక్యతను నిలుపు కోవాలన్న తపన కావచ్చును. అది ఆరోగ్యకరమైన సంప్రదాయం కాదు. ప్రేమించడం, ప్రేమను పొందడం అపూర్వమైన వరం. ప్రేమించే హృదయం ఒక దేవాలయం. అది తెలుసుకొని నువ్వు అవనిని ఆదరించ గలిగితే మేము సంతోషిస్తాం" అన్నాడు.

విభ్రమంతో అంతా విన్న విశ్వం కళ్ళు చెమ్మగిల్లగా స్నేహితుడి చేతులు పుచ్చుకొని, "నన్ను క్షమించు" అన్నాడు.

◆

